పురుషులకు ప్రత్యేకం



# మహానుభావుడి కథ

\- నోమల జగన్నాధరావు

అతడి ఒంటిరంగు ఎర్రటెరుపు. అతడి ఎత్తు అయిదడుగులు. అతడి వయసు ముప్పై తొమ్మిది సంవత్సరాలు.

అతను ప్రతాపరావు. ఊరు విశాఖపట్నం ఉద్యోగం ఒక ప్రభుత్వ సంస్థలో, సీనియర్ క్లర్కు.

ఆ ఉదయం, ఎర్రటిఎండ, ఎండాకాలంతీక్షణతని సంతరించుకొని విజృంభిస్తోంటే, అతను వీధి బోరింగుకొట్టి,బాల్చీలతో నీళ్ళుమోస్తూ, మా ఇంటికి రెండిళ్ళవతలేవున్న వాళ్ళింటికెళ్తూ, బోరింగుకొస్తూ-

వీధి గడపలో నిలబడ్డ నన్ను రెండుమూడుమార్లు తేరిపారాచూసి, "మీరు? సువర్ణేశ్వ రావుగారుకదండీ? యామై కరెక్ట్? అవునా?" అనడిగేడు.

మందహాసాన్ని చిందించీ, "అవును" అన్నాను.

అతడుకూడా నవ్వేడు! ఎండాకాలంలో ఏటిగాలి లాంటి ఆనవ్వు ఎంతోహాయిగా అనిపించింది.

అతడి తండ్రి ఈశ్వరుడుగారు! ఆయనగారు మాకు బాల్యంలో, సెకెండుఫారంలో లెక్కలమేస్టారనీ; లెక్కప్రకారం ఆయన ఇద్దరంటే ఇద్దరే మగపిల్లల్ని కన్నారనీ; సంసారంకూడా ఆచితూచి అంతా పొందికగా, జాగర్తగా లెక్కగానే చేస్తారనీ: ఆయిన ఇంట్లో నేను ఏడాదిపాటు లెక్కలు, ఇంగ్లీషు ప్రయివేటు చదువు కున్నాననీ ఆయనెంత మంచిమనసుగలవాడో, అంతమాట ధురుసు మనిషనీ; క్లాసుపిల్లల్ని తన పిల్లల్ని "కైరాతీ గాడిద కొడకల్లారా" అని తిట్టే వాడనీ; ప్రయివేటుకెళ్ళినపుడు, వారింట్లో ఈ ప్రతాపుడే ఎడతెగని అల్లరిచేసిచేసి, నాన్నచేత వీరబూతులు తిట్టించుకొనీ, వీపుసాపు చేయించుకునే వాడనీ, నాకు ఆ జ్ఞాపకాలన్నీ వర్సవర్సగా వచ్చేసేయి.

ప్రతాపుడి మొహం ఏం మారలేదు, శరీరం పెరిగింది; చదువు అనుభవాలూ పెరిగేయి.

"అదిగోనండీ! అల్లదే మా ఇల్లు!" అని, చూపెట్టేడు ప్రతాపరావు. "మేందిగీ రెండ్రోజులయిందిసార్! అద్దె మూడొందలు! గదికి వందా! నేనూ నా భార్య, ఇద్దరు పిల్లలం! వాళ్ళు కాన్వెంట్‌లో ఎనిమిదీ, ఆరూ చదువు తున్నారు! మీరు ఎప్పుడో నన్ను చూసినా, అంతగ్నాపకం వుంచుకున్నారు సార్!" అని, అతడు ఎంతో సంతోషంతో అంతమొహంచేసుకునీ, నా చేతులు పట్టేసుకున్నాడు.

"మీరీవూళ్లోనే అప్పట్నించీ వున్నారుగానీ, నేను మాత్రంవూర్లువెంబడి తెగ తిరుగుతున్నానార్! ఇదిగో!నమ్మండీ! నమ్మకపోండి!...నేను నా ఇంటరు చదువయిందగ్గర్నించీ, ఇంట్లోవాళ్ళతో తగువులువడీ, పడీ, కోపమొచ్చి ఇల్లొదిలీసేను!! మెడ్రాసులో వెయ్యి రూపాయలు క్షవరం చేయించుకున్నాను!ఆతర్వాత వారాలు చేసేను! మళ్ళా ఈవూరొచ్చాను! సీతమ్మధారలో సీతమ్మని సంపాదించేను! లవ్‌మారేజ్! "అని ప్రవాహా న్నాపీ, కొంచెమే సిగ్గుపడ్డాడు.

"ఏం? ఆ తర్వాత....గవర్నమెంటుజాబ్‌నీ, బియ్యే డిగ్రీనీసంపాదించుకున్నానార్!! అన్నాడు.

అంతలో-

బోరింగుకి వాళ్ళావిడవచ్చింది!

అతడికంటే అంగుళం పొడుగ్గావుంది, అతడికంటే రెండించీలు బలంగా వుంది; అతడే ఆవిడకంటే బావున్నాడన్నట్టు వుంది.

"ఇంట్లోకిరండి!" అని పిల్చేనతడ్ని.

"మొగవాళ్ళకి వాకిట్లోనే మాటలు బావుంటాయి" అన్నాడతను. నవ్వొచ్చిందతడిమాటకి.

'ఇతడి మాటలికి వరదవెల్లువధాటియే కాకుండా, వసంత సమీరం ఆహ్లాదంకూడా వున్నది సుమా!' అనుకున్నాను..

మాఅమ్మ, ప్రతాపరావు భార్యని ఇంట్లోకి ఆహ్వా నించింది! ఆవిడపేరు. మందాకిని!

అయిదేనిముషాలలో, అరవయి సంవత్సరాల స్నేహపు బలిమితో, కలిసిపోవడమూ తెలును ఆడవారికి!! అరనిమిషంలో, చిక్కటి బంధాన్నిచిటుక్కున తెంపే స్కోడమూ తెలును!!

ప్రతాపరావు పెళ్ళాన్ని అన్నం వడించమని, ఆఫీసుకు టైమవుతోందనీ చెప్పి వెళ్ళిపోయేడు!

అతడలావెళ్ళగానే- నాచుట్టూ గాలికూడా స్థంభించిపోయినట్టనిపించింది! అతను మాట్లాడ్తే టైముకూడా తెలీదునాకు! అదీ అతడే చెప్పాలి!!

మందాకిని ఆసాయింత్రం ఒక చిన్న స్టీలుగిన్నెతో ఏదో తీసుకువచ్చి అమ్మచేతికివ్వబోతే "ఏంటిది?" అడిగింది అమ్మ.

"ఏదోలెండి మామ్మగారు! వలహారం! మేం ఈరోజు మినపరొట్టె చేస్కున్నాం! మీకు నా చేతివంటకం రుచి చూపిద్దామని.." అని నవ్వేసింది మందాకిని.

ఆరోజునించీ-

మందాకిని, ప్రతీ సాయింత్రం ఏదో ఒక వలహారం, వద్దన్నా తీసుకురావడం, బలవంతంగా మా ఇంట్లో పెట్టేయడం!

మొహమాటంతో మామొహాలు వాలిపోవడం మొదలు పెట్టేయి.

"ఇదేవిట్రా?" అంటూ అమ్మగోల!

"మందాకినికి మనంకూడా ఏదయినా ఇవ్వాల్రా! లేకపోతే బావుండదు" అని వాపోయిందమ్మ.

రెండుపూటలా భోజనాలేగానీ, ఇలావలహారాలు వదేవదే చేసుకోవడం మా ఇంటిలో అలవాటులేదేమో, మాకు ఇదంతా యిబ్బందిగావుంది!

ప్రతాపరావేమో, ప్రతీరోజూ, రోడ్డుమీద, నాతో, "చచ్చిపోతున్నాంసార్' నాకువచ్చేజీతం మాసంసా రానికి బొత్తిగా సరిపోవటంలేదనుకోండి! ఏదయినా పార్ట్ టైమ్ జాబ్ చేద్దామంటే, ఎక్కడా దొరకట్లేదు!" అని బాధ ఒలకబోసుకుంటున్నాడు!

అతను, భార్య పిల్లలు వారానికి రెండు, మూడు సినీమాలికి తప్పని సరిగా వెళ్ళడం చూస్తున్నాం

మేము!!

అతను గొప్పగా, "వారానికి కనీసం మూడయినా పిక్చర్సు మేం చూస్తాంసార్! లేకపోతే ఏమిటో కోల్పోయి నట్లే వుంటుంది! మాకు రిక్షాలకి, టిక్కట్లకీ, పిల్లలికి చిరుతిళ్ళకీ, అక్కడ మాకు టీలకీ, కిళ్ళీలకీ, ఓహ్! చమురు బాగానే వదుల్తుందనుకోండీ..." అంటాడు!!

ఈ మనిషిగురించి ఇంక ఏం అనుకోవాలి?!! అతడు పదేపదే పిలవగా, అమ్మతో నేను వాళ్ళింటికి వెళ్ళేను!

మూడుగదులూ మూర్చపోగొట్టేనంత చేసేయి, మమ్మల్ని!! ఇంటిలో ఓ కుర్చీగానీ, టేబిలుగానీ, మంచంగానీ, రేడియో, ఫాను ఏవీ అవసరం అయినవి కనిపించ లేదు!! చాపలున్నాయి! పక్కబట్టలుమాసి పెద్ద చుట్ట చుట్టీ గదిలో పడున్నాయ్! నేలంతా తొక్కులతో గలీజుగా అశుభ్రంగా వుంది! గోడలనిండా పిల్లలు పెన్సిళ్ళతో ఖరాబు చేసేరు!

మందాకిని మాకు పెద్దస్టీలుగ్లాసులతో కాఫీలివ్వబోతే, మాకు తీసుకోబుద్ధి కాలేదు! సగౌరవంగా తిరస్కరిస్తే, వాళ్ళు ఎంతో బాధ పడిపోయేరు! "అదేవిటండీ? మేం, పిల్లలూ రోజుకి అరడజనుసార్లయినా కాఫీతాగుతాం గదా? మీరుతాగరా?" అందామె బాధపడ్తూ.

"ఒక్కమారే, కప్పుడేతాగుతాం" అంది అమ్మ.

మర్నాడు-

"ఒక్క ఫిఫ్టీ రూపీస్‌వుంటే సర్దండి!సార్! జీతా లందగానే ఇచ్చేస్తాను" అని వచ్చి అడిగేడు, ప్రతాప రావు!!

నాకేమిటో ఇవ్వాలనించలేదు!

"ఇవ్వకపోతే బావుండదేమోరా! ఆవిడ అన్ని ఫలహారాలు తెచ్చేదిగదా?" అని మూలిగింది అమ్మ!!

"సరే" అని నేనూ మూలిగి ఏభై రూపాయలిచ్చాను.

ఆరాత్రే మందాకిని ఒక కంచంలో బొబ్బట్లు నాలుగు పెట్టి పట్టుకువచ్చి ఇచ్చింది!! అమ్మా నేను ఆశ్చర్య పోయేం.

"పుట్టిన్రోజా? ఎవరిది?" అడిగేం!

"అబ్బే! పుట్టిన్రోజుఏంకాదండీ! మేం ఇట్లా ఎప్పుడూ పిండివంటలు చేస్కుంటాములెండి! అలవాటే! అని చెప్పేడతడు!!

ఆనెలలో అతగాడు నన్ను పాతిక అప్పులయినా అడిగేడు!!

పదీ-పాతిక-ఏభయ్-ఇలా!!

ఇచ్చింది మళ్ళా తీర్చలేదు!! గట్టిగా అడగ్గా విను క్కోవడం మొదలెట్టేడు!! నేనతగాడికి దూరం దూరంగా వుండడం మొదలుపెట్టేను. మందాకినివస్తే అమ్మ మాట్లాడడం మానేసింది. వీధి బోరింగు దగ్గరికి నీళ్ళు పట్టుకోందుకివెళితే-

"ఛాఛా! ఏం మనుషులండీ, వాళ్ళు? బొత్తిగా మర్యాదా, గౌరవంలేవు! ఇంతకాలమూ మా ఇంటినించి ఏదుంటే అది, మేం ఏం చేస్కుంటే అది తీసుకుని, ఇప్పుడు మమ్మల్ని దూరంగా నెట్టేసేరు చూడండి!! పదిరూపాయలు బదులడిగేమనీ, మాతో మాట్లాడ్డం మానేసేరు చూడండి!!" అని ప్రతాపుడు, నీళ్ళవాళ్ళం దరితో వాగుతున్నాడు!!

నాబుర్ర గిర్రున తిరిగింది!!

ఏదో మామేస్టారికొడుకు అనే గౌరవంతో నేనతడికి అడిగినప్పుడల్లా డబ్బిచ్చేను! ఆయన నాకు ప్రయివేటు చెప్పి, జీతం తీసుకున్నా విద్యాదానం చేసేరు! ఆ కృతజ్ఞత నాకు ఆయనమీదవుంది! అది కొడుకుమీద కూడా చూపించేనుగాని, అతగాడు ఆమంచి భావాన్ని నిలుపుకోలేదు!! ప్చ్!!

అసలు ఈ ప్రతాపుడు, ఎందుకు ఇంట్లో విరోధంపడి దూరంగా వెళ్ళిపోయాడంటే-

వీడు చిన్నతనంనించీ ఒంటిపిల్లిరాకాసి! మరో పొడగిట్టేదికాదు! తల్లితండ్రితో ఎప్పుడూ తగువులాడే వాడు! వాళ్ళు వాడికేదో అన్యాయం చేసేసినట్టు అవమానపరిచినట్టూ తెయ్యిమని ఆడేవాడు!!

పెద్దయ్యాక ఏమయినా మారేడని నేను అను కున్నాను!

మొదటవాడి వాలకం నాలో ఏదో సంతృప్తిని కలుగజేసింది.

ప్రతాపుడిలో మంచి మార్పొచ్చిందని! కాని—

వాడి బుర్ర అప్పుడలా వక్కదారివట్టితే - ఇప్పుడు మరోవిధంగా వక్కదారివట్టింది!!

ప్రతాపుడు ఈవూర్లో - ఏ ఒక్కచోటా, పట్టుమనీ పదిమాసాలు కూడా వుండడంలేదని, వాడికీ, నాకూ కూడా తెల్సిన ఒకతను చెప్పేడు!! ప్రతీచోటా విపరీ తంగా అప్పులుచేసెయ్యడం! బాకీలలా వుంచేసీ, మరోచోటికి వెళ్ళిపోవడం!!

* * * *

వాళ్ళు ఇల్లు మార్చేస్తున్నారని అమ్మచెపితే, అంత ఆశ్చర్యం కలగలేదునాకు!

రెండే రిక్షాల్లో - వున్న డబ్బాడవాలానీ వడేసేరు ఆ ఆదివారం!

మా వీధి అరుగుమీద నేను వున్నానప్పుడు.

నా అంతరంగంలో ఏదో ఆవేదన వుంది.

ప్రతాపుడీరోజు చెడ్డయిపోయేడు. కాని-

ఎప్పుడూ నాకు విరోధికాడు అతడు!

నాతో గంటలు గంటలువాగీ, కాలాన్ని స్తంభింప జేసిన ఘటికుడే!!

పలహారాలు ఇచ్చి పరాయివాళ్ళ అంతరంగాన్ని ఆకట్టుకునే మర్యా దస్తురాలు మందాకిని!

మొత్తానికి వాళ్ళు 'వాయుగుండం' అయ్యా, ఒక వూపు వూపేసారు మిమ్మల్ని!

వాళ్ళు మా దగ్గరికొచ్చి 'వెళ్తున్నాం' అని చెప్ప నయినా చెప్పకపోవడం, మాకు మరీ ఆశ్చర్యమనిపించ లేదు.

* * * *

మా ఆఫీసులో 'కిరీటి' అని యూడీసీ వున్నాడు.

నాతో కిరీటి చాలా చనువుగా, స్నేహంగా వుంటాడు.

ఆరోజు కిరీటి ఒక కబురు చెప్పేడు!

"సార్! చాలా చిత్రమైన మనిషి నీ మధ్య నేను చూసేన్సార్! ఆయన మా వీధిలో, మా ఇంటిపక్కనే ఫామిలీతో అద్దెకి దిగేడండీ! ఇరవయి నాలుగ్గంటల్లో ఇరవయి అయిదుమందిని తన వాగ్ధాటితో పట్టేసేడను కోండి! ఆ మాటల వర్షంలో తడిసి ముద్దయి చస్తున్నా మంటే నమ్మండీ!"

"అలానా?" అని వూరుకున్నాను.

"జాగ్రత్త!" అనేమాట నేనెందుకు చెప్పాలి?

అనుభవమే పాఠం నేర్పుతుందెవరికయినా!

కిరీటి మరో రోజున మరో కబురు చెప్పేడు.

"సార్! ఆప్రతాపరావుగారేమో, వారింటిలో గోడ నించీ బూడిద కుంకమారాలుతున్నాయనీ అందరికీ తెలియచేస్తే, వీధిలో ఆడవాళ్ళంతా పొలోమంటూ వెళ్ళేరు సార్! ప్రతాపరావు భార్య మందాకినిగారు ఆగోడ వద్ద మఠం వేస్కుని కళ్ళు మూసుక్కూచుంది! కుంకం, బూడిదా రాలడం ఇందాకే ఆగింది అని ఆవిడ చెప్పింది. ఒక పెద్ద కాయితం పొట్లం విప్పి, అందులో వున్న కుంకం ఆడవాళ్ళకిచ్చి, పెట్టుకుంటే దొంగభయం, ఆపదలూ, రోగాలూ, ఏ బాధలూ కలగవని చెపితే, వాళ్ళు కొబ్బరికాయలు, అరటిపళ్ళు, కర్పూరం, ఇంకా జాకెట్టుగుడ్డలూ, దక్షిణలూ వగయిరాలు సమర్పించుకున్నార్సార్! ఇదంతా డ్రామాకాదుగదా?" అనడిగేడు కిరీటి!

నవ్వి వూరుకున్నాను!

మరోపది రోజులు గడిచేక-

"ఎలావుంది? మీ వీధికథ?" అడిగేను.

కిరీటి నిట్టూర్చేడు.

"పాపం!" నేనూ నిట్టూర్చేను.

ఆ సాయంత్రం, రోడ్డుమీద, ప్రతాపరావు నాకు కనిపించేడు. విచారవదనంతో నన్ను సమీపించేడతను. నా చేతులు పట్టేసుకున్నాడు అమాంతం!

"సార్! నేను మిమ్మల్ని ఏమయినా బాధపెట్టేనా చెప్పండి, సార్! ఎవరినయినా మనం బాధపెడ్తేనే, మనకి వునురు తగిలీ, ఏదోఒక కష్టం వస్తుంది!! నిజం! మా ఆవిడకి పొట్టలో అల్సరయింది! ఆపరేషను చెయ్యకపోతే చనిపోతుందిటసార్! ఆపరేషనుకి రెండు వేలయినా అవుతుందంటున్నారు డాక్టర్లు!! ఎలాసార్? కొంతమంది ధర్మాత్ములు సాయం చేసేరు! మీరూ..." అని ఆగేడతను.

నా మనసు ఆర్ద్రమయిపోయింది.

నా జేబులో అప్పటికప్పుడు పది రూపాయలకంటే లేవు! అందుకని ప్రతాపరావుని నావెంట, ఇంటికి తీసుకువెళ్ళేను.

అమ్మ అనుమానాన్ని వ్యక్తం చేసింది.

"అదంతానిజమా? అబద్ధవో? డబ్బులు ఇవ్వకు" అని చెప్పింది.

"వాడి మొహం చూడమ్మా! నిజంగానే కష్టంలో వున్నారు వాళ్ళు." అనిచెప్పి, ప్రతాపరావుకి, నాచేత నయింది ఏభయ్ రూపాయ లు ఇచ్చేను.

కిరీటి కూడా, ఒక వందవరకూ డబ్బు ఇచ్చేనని చెప్పేడు. మందాకిని, ప్రతాపరావుకి దక్కాలని, మేమందరం ఆ భగవంతుడిని కోరేము.

* * * *

"ప్రతాపరావుకి బదిలీ అయిందిట, సార్! ఫామిలీతో నిన్ననే వెళ్ళిపోయేడు! చాలాదూరంగా ట్రాన్స్‌ఫర్ చేసే సేర్ట!" అని చెప్పేడు కిరీటి.

"ఆవిడ ఆపరేషనేమయిందయ్యా?" ఆత్రంగా అడిగేను.

"ఆవూసే ఎత్తలేదతను! వీధిలో ఎవళ్ళం అడిగినా' అలాగే తప్పకుండా చేయించుతాను!" అని మాత్రం అన్నాడండీ!!"

"నిజంగా బదిలీ అయిందంటారా?"

"బదిలీ నిజమే అని, మరో అతను, అతనికీ, మాకూ బాగా తెల్సినతను మాకు చెప్పేడ్సార్!! ఈవారంలో, వెళ్ళిపోవడానికి అంతా సిద్ధం చేస్కునే, ప్రతాపరావీ డ్రామా ఆడేడని, అతగాడు వెళ్ళిపోయేకా తెల్సింది!!"

"ఏవిటి?! ఆపరేషనుకనీ అందర్నీ అడిగిన డబ్బులు పట్టుకునే వుడాయించేసేడా?! ఏవూరో చెప్పేడా?"

"ఏదో పేరు చెప్పేడు గానీ, ఆవూరదికాదన్నాడు. అతని ఫ్రెండు! ఎంతమోసవో చూసేరాసార్?"

ఈ సార్ ఏం చెబుతాడు?!!

ఇలాంటి ప్రతాపరావులు ఇంకా ఎందరో?

ఈ రచన "ప్రతాపరావుల్ని" మార్చకపోవచ్చును!! కానీ - వాళ్ళ ట్రాప్‌లో పడబోయే వారికేమయినా... సాయం చేస్తే ధన్యుణ్ణి! □